20న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బాడంగి: లేబర్ కోడ్ చట్టాలకు వ్యతిరేకంగా ఉపాధి హామీ పరిరక్షణ కోసం ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు బాడంగి మండలం కార్యదర్శి ఏ.సురేష్ పిలుపునిచ్చారు. బాడంగి మండలం భీమవరం గ్రామంలో ఉపాధి కూలీలతో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకి 200 రోజులు పని కల్పించి రోజుకి 600 రూపాయలు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ చట్టాలను తీసుకు రావడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మురళి ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వరండాను ఆక్రమిస్తే... విద్యుత్ బిల్లు కట్టేదెలా...?

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద గల కరెంట్ బిల్లులు కట్టించుకునే కేంద్రం ఆవరణను వ్యాపారులు ఆక్రమిస్తున్నారు. దీనివల్ల విద్యుత్ బిల్లు కట్టేందుకు విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. చిరు వ్యాపారం చేసుకునే వారు ఈ కేంద్రం ముందున్న వరండాను ఆక్రమించడంతో కరెంట్ బిల్లులు కట్టేందుకు వచ్చే వినియోగదారులంతా మార్గం లేక ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ సిబ్బంది కూడా చూసిచూడనట్టు వ్యవహరించడంతో చేసేదేమి లేక వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు వ్యాపారులని కేంద్రం ముందు ఖాళీ చేయించి వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్నారు.

మన క్రీడా విధానం దేశానికే ఆదర్శం

- చదువుతోపాటు ఆటలకూ ప్రాధాన్యత
- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: క్రీడావిధానంలో మనం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఒక్క మన రాష్ట్రంలోనే ఉద్యోగాల భర్తీలో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, క్రీడలకోసం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నామని చెప్పారు. స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో జరుగుతున్న 3వ జాతీయ తైక్వాండో శిక్షణా సెమినార్‌కు మంత్రి శ్రీనివాస్ మంగళవారం హాజరయ్యారు. క్రీడాకారులకు ఇస్తున్న శిక్షణను తిలకించారు. ఒడిషా, ఛత్తీస్‌ఘడ్, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోచ్‌లు, క్రీడాకారులతో మాట్లాడారు. మానవ వనరులే మన దేశానికి ఆస్తి అని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి చదువుతోపాటు, ఆటల్లో కూడా రాణించి మన రాష్ట్రానికి, ప్రాంతానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతీ జిల్లాలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్, అంతర్జాతీయ క్రీడాకారుడు, తైక్వాండో కోచ్ అబ్బాస్ షేకీ, తెలంగాణా రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె.శ్రీహరి, మక్కువ శ్రీధర్ తదితర ప్రముఖులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై గ్రామ సభ

విశాలాంధ్ర - గజపతినగరం: మండలంలోని రాజుపేట గ్రామంలోని ఆర్బీకే వద్ద గజపతినగరం డివిజన్ పిడి షీల నవధాన్యాల సాగుపై గ్రామసభ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ ముఖ్య అధికారి జేడీఏ రామారావు, ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం ఆనంద్‌లు పాల్గొని నవధాన్యాల యొక్క ఉపయోగాలను రైతులకు వివరించారు. నేల గుల్ల భారీ సూక్ష్మజీవులు, వాన పాములు వృద్ధి చెందుతాయని, నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, నేల కింద సూక్ష్మజీవులు, నేల మీద పంటల జీవవైవిధ్యం పెరుగుతుందన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కే.మహారాజన్, మండల వ్యవసాయ అధికారి సిహెచ్.ధనలక్ష్మి, వీఏఏలు, ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామ సర్పంచ్ గేదెల ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ పోలమ్మతల్లి జాతర

విశాలాంధ్ర - జామి: మండలంలోని శాసనాపల్లి గ్రామంలో గ్రామ దేవత శ్రీ పోలమ్మతల్లి అమ్మవారి జాతరను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచే పూజా కార్యక్రమాలను నిర్వహించగా, మహిళలు పసుపు, కుంకుమలను మొక్కుబడిగా చెల్లించారు. జాతర నేపథ్యంలో ఆలయాన్ని ఉత్సవ కమిటీ సుందరంగా తయారు చేసింది. విద్యుత్ కాంతులతో గ్రామమంతా కళకళ లాడింది. బంధువులు, స్నేహితులతో గ్రామంలోని అన్ని ఇళ్ళలు సందడిగా కనిపించాయి. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

త్రిపురమాంబ హెల్పింగ్ హ్యాండ్స్ ఆపన్న హస్తం

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు దుంగాడ గ్రామానికి చెందిన యువకుడు జోడు దేముదుబాబుకి గ్రామానికి చెందిన త్రిపురమాంబ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు రూ.10వేలు ఆర్థిక సహాయం చేసి తమ ఆపన్న హస్తం అందించారు. దేముడు బాబు ఇటీవల తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కాలుజారి క్రింద పడడంతో కుడి కాలు మడమ దగ్గర విరిగిపోవడంతో శృంగవరపుకోట వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించారు. ఈ మేరకు త్రిపురమాంబ హెల్పింగ్ హాండ్ సభ్యులు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు కాపు వెంకటేశ్వర్‌రావు, ఉగ్గిన శ్రీనివాసరావు, కొప్పల దేవి, వరపుల సన్యాసిరావు, కొప్పల వెంకట అప్పారావు, కొప్పుల సన్యాసి దొర తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - గుర్ల: మండలంలోని కెల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి సందడి చేశారు. నాడు చదువుకున్న సమయంలో తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు.

రాష్ట్రంలో గాడి తప్పుతున్న లా అండ్ ఆర్డర్

- సంక్షేమాన్ని వదిలేసి, కేసులే లక్ష్యంగా ఏడాది పాలన
- ఇచ్చిన జీవోలు, హామీలు అమలుకు నోచుకోలేదు
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, జిల్లా వైసీపీ కన్వీనర్ చిన్నశ్రీను

విశాలాంధ్ర - విజయనగరం: రాష్ట్రంలో లా అండ్ అర్డర్ సమస్య గాడి తప్పుతోంది. కేవలం వైసీపీ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలే లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం కేసులు పెడుతోంది. ఏదో ఒక కేసు నమోదు చేసి భయాందోళనకు గురిచేస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిన్నశ్రీను ఆరోపించారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి విడదల రజనిపై పోలీసులు చేసిన దాష్టికం చూస్తే ఎవరికైనా ఈ ప్రభుత్వం కేవలం కక్ష్య పూరితంగా పాలన చేస్తోందని తెలుస్తోందన్నారు. ఏడాది కాలంగా ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధి పనులను పక్కనబెట్టి కేవలం కేసులే లక్ష్యంగా పని చేశారన్నారు. ఇచ్చిన జీవోలు, హామీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. నవంబర్‌లో మరణించిన వారికి ఇస్తామన్న స్పౌజ్ పింఛన్లు నేటికీ అందలేద న్నారు. సోమవారం జిల్లాలో జరిగిన డిఆర్‌సి సమావేశంలో అనేక సమస్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ప్రధానంగా జిల్లాలో రెండవ ప్రాధాన్యత కలిగిన చెరుకు పంటకు పెద్దదిక్కుగా మారిన సంకిలి సుగర్స్‌ను త్వరలో ఇథనాల్ ఫ్యాక్టరీగా మార్చేందుకు యాజమాన్యం దృష్టి సారించిందని, ఈవిషయమై తగిన విదంగా స్పందించాలని కోరినట్లుగా తెలిపారు. అపరాల కొనుగోలు లేక రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు నేరుగా ఆర్‌బికెల ద్వారా ఎరువులు, విత్తనాలను అందజేసామని, కానీ నేడు బహిరంగ మార్కెట్లలో రైతులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రైతులకు విద్యుత్ కనెక్షన్‌ల మంజూరుపై స్పందించడం లేదన్నారు. గ్రామాలలో పారిశుద్యం పనులు చేపట్టేందుకు ప్రత్యేక నిధులను స్థానిక సంస్థలకు కేటాయించడం లేదన్నారు. ఏడాది కాలంగా ఒక్క పైసా కూడా జిల్లా పరిషత్‌కు రాలేదన్నారు. కేవలం 15వ ఆర్థిక సంఘ నిధులు మాత్రమే వస్తున్నాయన్నారు. చౌకరకం మద్యాన్ని ప్రజలకు ఇష్టానుసారంగా సరఫరా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని కాంక్షించే విదంగా పాలన చేయాలని కోరారు.

నాయి బ్రాహ్మణుల సామాజిక భవనం నిర్మాణానికి కృషి

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర - లక్కవరపుకోట: నాయి బ్రాహ్మణుల సామాజిక భవనం నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల పార్టీ క్యాంపు కార్యాలయంలో కొత్తవలస మండలం నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేని కలిసి సామాజిక భవన నిర్మాణానికి ప్రభుత్వం తరఫు నుంచి నిధులు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొత్తవలస టీడీపీ నాయకులు లాలం అర్జున్‌రావు, నాయి బ్రాహ్మణుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

అవయవదానంతో ఆదర్శంగా నిలిచిన దంపతులు

విశాలాంధ్ర - నెల్లిమర్ల/చీపురుపల్లి: నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు శివుకు బంగారయ్య, రామలక్ష్మి దంపతులు అవయవదానం చేశారు. మంగళవారం చీపురుపల్లికి చెందిన మానవీయత సేవా సంస్థ అధ్యక్షుడు బివి గోవింద రాజులు, చీపురుపల్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సుధీర్, బల్లా విజయలక్ష్మికు అంగీకార పత్రాలు అందించారు. ఈ సందర్భంగా బంగారయ్య మాట్లాడుతూ మానవజన్మ భగవంతుడు ఇచ్చిన గొప్ప వరమని, ఈ అవకాశాన్ని సమాజ సేవలో సద్వినియోగం చేసుకుంటానన్నారు. అవయవ దానం ద్వారా తాను మరణిస్తూ మరెన్నో ప్రాణాలకు ఊపిరి పోయవచ్చు అన్నారు. మరణం అంచున ఉండేవారికి కూడా జీవితాన్ని ప్రసాదించవచ్చన్నారు. "మన్ కీ బాత్"లో ప్రధాని మోదీ సైతం ఈ అంశాన్ని ప్రస్తావించారన్నారు.

ఉపాధి హామీ కార్మికులకు అవగాహన

విశాలాంధ్ర - గంట్యాడ: గంట్యాడ మండలం నరవ గ్రామంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు గండేపల్లి భీముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు, గంట్యాడ మండల కార్యదర్శి కాళ్ళ కృష్ణలు ఉపాధి హామీ చట్టంపై కార్మికులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క కార్మికునికి ఒక సంవత్సరమునకు కనీసం 200 రోజులు ఉపాధి పని కల్పించాలని, రోజుకి 700 రూపాయలు కనీస వేతనం ఇవ్వాలని, వేసవి సందర్భంగా మజ్జిగ, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ చేయాలన్నారు. శాశ్వత ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించకుండా బినామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ని కొనసాగిస్తున్న ఉపాధి హామీ సిబ్బందిపై తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. జంకవాణి, దెంకవాణి చెరువులలో కొన్ని గ్రూపుల వారికి జియో ట్యాగింగ్ చేసి మరికొన్ని గ్రూపులకు జియో ట్యాగింగ్ చేయలేదన్నారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లు

విశాలాంధ్ర - భోగాపురం: విద్యా హక్కు చట్టం ప్రకారం భోగాపురం మండలంలో గల ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 15 లోగా దరఖాస్తులు చేసుకోవచ్చని భోగాపురం మండల విద్యాశాఖాదికారులు ఎం.రమణ మూర్తి, బి.చంద్రమౌళి తెలిపారు. మండలంలో శ్రీ సాయి నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చంద్ర విద్యా నికేతన్ స్కూల్, శ్రీ విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ప్రశాంతి విద్యా నికేతన్, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్, విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. ఈ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల భర్తీకి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అనాథలు, హెచ్.ఐ.వి భాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గానికి చెందిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. విద్యార్థికి ఆగస్టు 31 నాటికి 5 సంవత్సరాలు పూర్తి అవ్వాలని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు మే 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గ్రామంలో అల్లర్లు జరగకుండా చర్యలు చేపట్టాలి

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - వంగర: మండలంలో లక్ష్మీదేవిపేట, వంగర పోలీసు స్టేషన్ను మంగళవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సందర్శించి, గ్రామంలో శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ముందుగా లక్ష్మీదేవిపేట గ్రామాన్ని సందర్శించి, ప్రస్తుతం గ్రామంలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. గ్రామంలోని ప్రధాన వీధులను సందర్శించారు. 2012 సం.లో గ్రామంలో బీసీలు, ఎస్సీల మధ్య గొడవలకు గల ప్రధాన కారణాలను, గ్రామంలో ప్రస్తుత పరిస్థితి, న్యాయస్థానంలో కేసుల విచారణకు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రజలందరూ శాంతియుతంగా మెలిగే విధంగా చూడాలన్నారు. తరచూ గ్రామంలో గ్రామసభలు నిర్వహించి, శాంతి నెలకొనే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. గ్రామంలో పోలీసు పికెట్ ను కొనసాగించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగే అంశాలు ఏమైనా ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని రావాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో ఎటువంటి అలసత్వం వద్దని, గ్రామంలో బీసీలు, ఎస్సీలు మధ్య గొడవలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. అనంతరం, వంగర పోలీసు స్టేషన్ను సందర్శించి, అధికారులతో సమావేశమై, శాంతిభద్రతల పరిరక్షణకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా ఎస్పీ వెంట చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్సై సిఐ ఎ.వి.లీలారావు, వంగ ఎస్సై షేక్ శంకర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య కార్మికులు సక్రమంగా విధులు నిర్వర్తించాలి

- మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర - బొబ్బిలి: పారిశుధ్య కార్మికులు విధులు సక్రంగా నిర్వర్తించాలని పట్టణ ప్రజలు తడి చెత్త పొడి చెత్త వేరుచేసి మునిసిపల్ పారిశుధ్య వాహనాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో బలిజిపేట రోడ్డు, అగురు వీధి, వరహాగిరి వారి సందు చిన్న బజారు, మార్కెట్ ఏరియాలలో పర్యటించారు. బలిజిపేట రోడ్డులో ఖాళీ స్థలంలో ఉన్న చెత్తను ఏరి వేయించాలని, గార్బేజ్ వలనరబుల్ పాయింట్లను క్లియర్ చేయించాలని ఆదేశించారు. అగురు వీధిలో మునిసిపల్ బావి గట్టు తొలగించి పున: నిర్మించాలన్నారు.

అన్నదాత సుఖీభవను రైతులందరికీ వర్తింపజేయాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ

విశాలాంధ్ర - బాడంగి: టీడీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అందించనున్న అన్నదాత సుఖీభవ పథకం రైతులందరికీ వర్తింపజేయ్యాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండ్ చేశారు. మండల తహశీల్దార్ సుధాకర్‌కు మంగళవారం పలువురు రైతులతో వచ్చి వినస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడూరు బ్రాహ్మణ వలసతో పాటు పలు గ్రామాల్లో రైతులు పంటలను సాగు చేస్తున్నారని అన్నారు. కౌలు భూములతో పాటు, పోడు భూములను కూడా సాగు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా సర్వే. నెంబర్ 509,513లో సుమారు 100 కుటుంబాలు రైతులు మామిడి జీడితోపాటు పలు పంటలను సాగు చేస్తున్నారని వారందరికీ ఈ పథకం వర్తించే విధంగా రెవిన్యూ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు రైతులందరూ ఈ పథకం వర్తించే విధంగా తగు చర్యలను తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ సభ్యులు కే రాజు, కే జ్యాస్, బోగి సంజీవ్ పలువురు రైతులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ

విశాలాంధ్ర - జామి :మండలంలోని విజినిగిరి గ్రామంలో హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ సభ్యులు గ్రామంలో పేదవారికి ప్రతీ నెల అందిస్తున్న మాదిరిగా ఈ నెల నిత్యవసర సరుకులు అందజేశారు.ఈ కార్యక్రమానికి కొవ్వాడ సత్యం మాస్టర్ కుటుంబ సభ్యులు, భోజరాజు నూకం నాయుడు కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గ మృతి తీరని లోటు

విశాలాంధ్ర - బాడంగి: ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గ మృతి తీరని లోటని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు అన్నారు. మండల కేంద్రమైన బాడంగిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఎనలేని పోరాటం చేసిన దుర్గ మృతి చాలా బాధాకరమని అన్నారు. చిన్న వయసులోనే స్టూడెంట్స్ అభ్యున్నతి కోసం చాలా కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి కే రాజు కే జూసు భోగి సంజీవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

6వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన



విశాలాంధ్ర -విజయనగరం: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య 6వ డివిజన్ లోని జమ్ము, ఆనందపురం, సాయి కాలనీ ప్రాంతాలలో పర్యటించారు. కాలువల పరిస్థితి, పారిశుధ్య విధానాన్ని గమనించారు. అనంతరం 7వ నెంబర్ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సకాలంలో సచివాలయ కార్యదర్శులు విధులకు హాజరవుతున్నారా లేదా అన్నది రికార్డులను పరిశీలించారు. పౌర సేవలు ఏ విధంగా అందిస్తు న్నారు అన్న విషయాలపై ఆరా తీశారు. అనం తరం అన్నాక్యాంటీన్ పరిశీలించి ప్రజలకు అందు తున్న ఆహారం పట్ల ప్రజాభిప్రాయాన్ని సేకరించారు.

వెయిట్ లిఫ్టర్ పల్లవికి నగదు బహుకరణ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని ఎస్.పల్లవికి నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు, సత్య విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు. ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ ఈ రోజుల్లో ఆడ, మగ అన్న తారతమ్య బేధం లేకుండా ప్రతి ఒక్క పోటీలోని అమ్మాయిలే ముందంజలో వుంటున్నారు. వెయిట్ లిఫ్టింగ్ ఎంత కష్టమైనదో అందులో ఎంతో అనుభవం ఉన్న వీసీ రాజు పల్లవి కనబరిచిన అద్భుతమైన ప్రదర్శన వలన భారత దేశానికి ఎంతో గౌరవం తీసుకొచ్చిందన్నారు. సత్య విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ డా. బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ కళాశాల విద్యార్థిని పల్లవి సాధించిన ఈ విజయాలు అన్నింటీ వెనుక కఠిన శ్రమ, పట్టుదలతో పాటు కోచ్ చల్లా రాము శిక్షణకు ప్రతిఫలం దక్కిందన్నారు. కామన్ వెల్త్ గేమ్‌లో ఎంపిక అవ్వటానికి ఎంతో శక్తితో కూడుకొని ఉంటుందనే అభిప్రాయంతో ధీర ఫౌండేషన్, సత్య విద్యా సంస్థలు సంయుక్తంగా మంచి పౌష్టికాహారానికై ప్రతి నెల 30,000/- రూపాయలు నగదును గత ఆరు నెలలుగా అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డా. మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపల్ డా. డి.వి.రామమూర్తి, వరల్డ్ అథ్లీస్ట్ ఆర్.యూ. నరసింహం, విశాఖ సంస్కృతి పత్రిక ఎడిటర్ పబ్లిషర్ సిరెలా సన్యాసిరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత గొడవలను పార్టీపై రుద్దకండి

జనసేన నేతల హితవు

విశాలాంధ్ర - డెంకాడ: వ్యక్తిగత గొడవలను పార్టీపై రుద్దవద్దని జనసేన నేతలు హితవు పలికారు. నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ మండలం రఘు మండ గ్రామంలో మంగళవారం జనసేన మండల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఎమ్మెల్యేపైన, జనసేన పార్టీపైన, నాయకులపైన అనాలోచిత వాక్యాలు మాట్లాడిన మిత్రపార్టీ సభ్యులకు మీలో మీకు సరితత్వం లేకుంటే అధిష్టానం వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ఎమ్మెల్యేని జనసేన పార్టీ తేలికపరుస్తూ చిర్రబుర్రులాడడం సబబు కాదన్నారు. అంతే కాకుండా నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలో ప్రతిపక్ష హోదా లేని వైసీపీ నాయుకులు పూసపాటిరేగ జనసేన నాయుకులపై నోరుజారితే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉత్తరాంధ్ర నాయకులు తుమ్మి అప్పలరాజు దొర, పిన్నింటి రాజారావు, పైల శంకర్, దిండు రామరావు, తొత్తడి సూర్యప్రకాష్, పాల శ్రీను, పైల శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహునికి అష్టోత్తర దట్టాభిషేకం

విశాలాంధ్ర -జామి: మండలంలోని కుమరాం గ్రామంలోని కళ్యాణ్ నగర్ లో ఉన్న శ్రీ ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి పుట్టినరోజు నేపథ్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా స్వామివారికి అష్టోత్తర దట్టాభిషేకం చేశారు. అనంతరం పుట్నాల ఉత్సవం, చక్రతీర్థం, బొందల సేవ,వసంతోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారి పూజా కార్యక్రమంలో వందలాదిగా మహిళలు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు, వ్యవస్థాపకులు కందాల ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

అనుకోని విపత్తు సంభవిస్తే..!

ప్రభుత్వ శాఖల మాక్ డ్రిల్
అప్రమత్తంగా ఉండాలి : జెసి సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: అకస్మాత్తుగా ఏదైనా విపత్తు సంభవిస్తే ...విపత్కర, సంక్షోభ పరిస్థితులు ఎదురైతే....యుద్ధం వల్ల బాంబులు పడి లేదా గ్యాస్ లీక్, షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే.... అలాంటి సమయంలో ప్రభుత్వం ఏవిధమైన సహాయ చర్యలు తీసుకుంటుందీ, వివిధ ప్రభుత్వ శాఖలు ఎటువంటి చర్యలు చేపడతాయి..ఆయా శాఖల సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను ఏవిధంగా కాపాడతారు...అన్న అంశాలను కళ్లకు కట్టినట్టు చేసి చూపించారు. బాంబులు, ఇతర ప్రేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే విధానాన్ని కూడా వివరించారు. జిల్లా విపత్తుల యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టిసి కాంప్లెక్స్‌లో మంగళవారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖ, ఎస్డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్, ఆర్టిసి తదితర శాఖలు ఈ విన్యాసాల్లో భాగస్వాములు అయ్యాయి. పై అంతస్థులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడం, క్షత గాత్రులను క్రిందకి దించడం, వారికి వైద్య సహాయాన్ని అందించడం, హుటాహుటిన ఆసుపత్రికి తరలించడం, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయ పడటం, అప్పటికీ పరిస్థితి అదుపులోనికి రాని పక్షంలో ఎన్డిఆర్ఎఫ్ దళాలు జత కలవడం, ప్రజల ప్రాణాలను రక్షించి, సహాయ చర్యలు చేపట్టడం తదితర అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రకృతి వైపరీత్యాలతోపాటు, మానవ ప్రేరేపిత ప్రమాదాలను సైతం ఎదుర్కొనే విధానాన్ని వివరించి, తమ సన్నద్ధతను తెలియజేశారు. అదేవిధంగా జనసమ్మర్ధం ఉండే ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ లాంటి చోట్ల తీవ్రవాదులు బాంబులు లేదా ఇతర ప్రేలుడు

పదార్థాలను పెడితే, వాటిని డాగ్ స్క్వాడ్ సహాయంతో కనుగొని నిర్వీర్యం చేసే విధానాన్ని సైతం ప్రత్యక్షంగా చూపించారు. ఈ విన్యాసాల్లో జిల్లా విపత్తుల యాజమాన్యసంస్థ జిల్లా మేనేజర్ ఎం.రాజేశ్వరి, ఆర్డిఓ డి.కీర్తి, జిల్లా అగ్నిమాపక అధికారి బివిఎస్ రామ్ ప్రకాష్, జిల్లా వైద్యోరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, జిజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, డిఎస్‌పి శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు, మున్సిపల్ కమిషనర్ పి. నల్లనయ్య, జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, ఎన్డిఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్రావు గాడే, ఎస్డిఆర్ఎఫ్ ఆర్ఎస్ఐ రఘు, తాహసీల్దార్ కూర్మనాథ్, సెక్షన్ సూపరింటిండెంట్ రామకృష్ణ తదితరులు తమ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి
జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ఏదైనా విపత్తు లేదా అనుకోని ప్రమాదం సంభవించే సమయంలో నిర్వర్తించాల్సిన విధులపట్ల ప్రభుత్వ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వివిధ ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా చేపట్టిన మాక్ డ్రిల్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ఇటువంటి మాక్ డ్రిల్ కారణంగా సిబ్బంది సన్నద్ధతను తెలుసుకోవచ్చునని అన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలు ఏవిధంగా ప్రవర్తించాలన్న అంశం కూడా తెలుస్తుందని చెప్పారు. ఏదైనా విపత్తు సంభవించిన సమయంలో, దానినుంచి బయటపడేందుకు, ప్రభావితులను రక్షించేందుకు ప్రభుత్వ సిబ్బంది చేస్తున్న చర్యలకు ప్రజలు సంపూర్ణంగా సహకారం అందించాలని, సహాయ చర్యల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

రెవెన్యూ పెంపునకు కృషి చేయండి

నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర - విజయనగరం: రెవెన్యూ పెంపుదలే లక్ష్యంగా కృషి చేయాలని అడ్మిన్ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని పన్ను పరిధిలోకి రాని నిర్మాణాలకు, తక్కువ పన్ను ఉన్న భవన

నిర్మాణాలకు పన్ను విధించే విధంగా చొరవ చూపాలన్నారు. ప్రతిరోజు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి భవనాల యొక్క కొలతలను నమోదు చేసుకొని తదనుగుణంగా పన్నులను విధించాలని చెప్పారు. ప్రతిరోజు నివేదికలను సమర్పించాలని తెలిపారు. చాలా ప్రాంతాలలో అదనపు భవన నిర్మాణాలకు పన్ను విధింపు లేకుండా ఉన్నాయని గుర్తించామని కావున తక్షణమే అటువంటి భవనాలను గుర్తించి పన్ను పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. అలాగే షాప్ రూములు అద్దె బకాయలు వసూలు, ఖాళీగా ఉన్న షాపులకు వేలంపాట నిర్వహించడం, ఖాళీ స్థలముల పన్నులను విధించడం వంటి విధానాలను ఈ నెలాఖరులోగా త్వరితగతిన చేపట్టి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లమ్మ పండగ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఆరాధ్య దేవత శ్రీ పైడితల్లమ్మ పండగ మహోత్సవం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ అమ్మవారి పండగ మహోత్సవం సందర్భంగా సోమవారం తోలేళ్ల ఉత్సవం, డప్పు వాయిద్యాల నడుమ, కాంగో నృత్య ప్రదర్శనలతో గ్రామ పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. అలాగే రెండో రోజు మంగళవారం అనుపోత్సవం సందర్భంగా ఉదయం10 గంటలకు గ్రామస్తులు అమ్మవారి బండి ప్రభను దిగ్విజయంగా నిలిపారు. ఈ సందర్భంగా రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ళ రాంప్రసాద్, టిడిపి నాయకులు, గ్రామ పెద్దలు, తదితరులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

జీపు జాతను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - లక్కవరపుకోట: జిల్లాలో దేశవ్యాప్త సమ్మె కొరకు జిల్లా వ్యాప్తంగా జీపు జాత నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ వామపక్షాలు పిలుపుమేరకు ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేసే విధంగా ఉమ్మడి జిల్లాల్లో ఈనెల 10 నుంచి 14 వరకు అన్ని మండల కేంద్రాలలో జీపుజాతను నిర్వహించ తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమాన్ని సంఘటిత, అసంఘటిత కార్మికులు, అర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు, రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి యూఎస్ రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బి.సూర్యనారాయణ, కార్మిక సంఘం గాడి అప్పారావు, టి.వెంకటరమణ, జి.దేవి, అప్పల నరసమ్మ, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాడడం గ్రామదేవత పండగ

విశాలాంధ్ర - బాడంగి: మండలం వాడాడు గ్రామం పరిడిమాంబ గ్రామ దేవత పండగ ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. 15 ఏళ్ల అనంతరం ఈ పండగను తీసుకురావడంతో గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో అమ్మవారు ఉత్సవాన్ని జరుపుకున్నారు. భక్తులు కోర్కెలు తీర్చే కలవ వలసిందిగా భావించి అమ్మవారు అనుగ్రహం కోసం గ్రామస్తులే కాక చుట్టుపక్కల ప్రజలు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి యొక్క ఘటాలను వీధిలో భక్తుల దర్శనం కోసం తిప్పారు. ముందుగా గ్రామ పురవీధుల్లో సినిమాను తిరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే రంగారావు (బేబీ నాయన)తో కలిసి బొబ్బిలి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అనంతరం గ్రామ దేవత అయిన మరిడిమాంబ అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారి సిరిమాను దర్శనం చేసుకోవటం జరిగింది.

ఘనంగా అక్కివరం శ్రీ పైడితల్లమ్మ సిరిమానోత్సవం

విశాలాంధ్ర - డెంకాడ: అక్కివరం గ్రామంలో మంగళవారం శ్రీ పైడితల్లమ్మ సిరిమానోత్సవం పండుగ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండే అమ్మవారు దర్శనం కోసం అక్కివరం గ్రామంతోపాటు చుట్టుపక్క గ్రామాల భక్తులు బారులు తీరారు. ఈ పండుగ గత వందేళ్ల తర్వాత చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పండగకు దూర ప్రాంతాల నుండి ఎంతోమంది భక్తులు రావడంతో గ్రామం అంతా కిక్కిరిసిపోయింది. ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ప్రారంభమైంది. వంశపారంపర్యంగా పూజారి కంది వెంకటరామచంద్రరావు సిరిమానును అధిరోహించారు. ముందుగా గ్రామ పెద్దలు టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు, మాజీ జెడ్పీటీసీ కంది సూర్యనారాయణ తదితర నాయకులు పైడితల్లమ్మ సిరిమానును లాంఛనంగా ప్రారంభించి పురవీధుల్లో భక్తుల దర్శనార్థం ఊరేగింపుగా చల్లగా కాపాడాలంటూ పైడితల్లమ్మకు జేజేలు పలికారు. డెంకాడ ఎస్ఐ ఆరంగి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బొబ్బిలిలో ఉర్దూ అకాడమీ లైబ్రరీ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - బొబ్బిలి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్, సెక్రటరీ వారి ఆదేశాల మేరకు ఉర్దూ అకాడమీ లైబ్రరీ బొబ్బిలి పట్టణంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చలో ఉర్దూ లైబ్రరీ కార్యక్రమం లైబ్రేరియన్ ఎం.ఏ ఖుద్దూస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రాచీన భాష ఉర్దూ భాష అని, రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూని ద్వితీయ భాషగా గుర్తించిందని, ఉర్దూ భాషను ప్రజల్లో తీసుకెళ్ళుటకు గాను ఉర్దూ ప్రేమికులు, ఉర్దూ సాహితివేత్తలు, విద్యార్థులు ఉర్దూ భాష యొక్క ప్రాముఖ్యతను గుర్తించుటకు గాను ఇలాంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ అధ్యక్షులు సయ్యద్ హాజీ పీరా, మున్సిపల్ కోఆప్షన్స్ సభ్యులు రియాజ్ ఖాన్, హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సభ్యులు షేక్ జాఫర్, హమీద్, సయ్యద్ బాబ్జి, రహీమ్ ఖాన్, జి.ఎం. ఖాన్, మదీనా, షాజాదా, నాగు పాల్గొన్నారు.

శ్రీ మరలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి

విశాలాంధ్ర -సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత అయిన శ్రీ మరలమ్మ తల్లి పండుగ అనుపు మహోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు,గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకొని ఆధ్యాత్మిక భావం అలమరుచుకోవాలని అన్నారు. సాయంత్రం నాలుగు గంటలు ఉండి అమ్మవారి ఘటాలుతో, మహిళా కోలాటాలతో,అమ్మవారి వేసాలతో, తీన్మార్ డప్పులతో, భారీ మందు గుండు బాణాసంచెలతో, పలు సంస్కృత కార్యక్రమాలతో అణుపు మహోత్సవం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొర్లి శ్రీనివాసరావు, సబ్బవరపు నాగభూషణ్, సబ్బవరపు దేముడు (నాగేంద్ర), సబ్బవరపు సత్యనారాయణ బుజ్జి, లాలం సతీష్, సబ్బవరపు శివ, నారపాడ సూర్య,ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రేవుపోలవరంలో వైభవంగా బంగారమ్మతల్లి జాతర

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో సముద్ర తీర ప్రాంతమైన రేవు పోలవరం గ్రామంలోని శ్రీ బంగారమ్మ తల్లి జాతర వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచి చుట్టుపక్కల గ్రామాలైన గుడివాడ బంగారమ్మ పాలెం, కొత్త పోలవరం, కొరుప్రోలు ,గుర్రాజుపేట, పెద్ద ఉప్పలం తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కలను తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయడంతో పాటు భారీ అన్న సమారాధన నిర్వహించడంతో భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు. విద్యుత్ అలంకరణ బాణాసంచా కాల్చారు. వివిధ సంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీపీ వెంకటలక్ష్మి, వైస్ .ఎంపీపీలు బొలిశెట్టి గోవిందరావు, చోడిపల్లి అప్పన్న, సర్పంచ్ మల్లె లోవరాజు, టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ ఎన్ .వెంకట్రాజు, చోడిపల్లి బంగారి, కోడా లోవరాజు వైసిపి నాయకులు చోడిపల్లి గోవిందు,చేపల రాజు తదితరులు దర్శించుకున్నారు.